
# మేకు

— పులికంటి కృష్ణారెడ్డి



మాకడు మాధవనాయుడు దగ్గర అప్పు చేసింది నిజం. ఆ అప్పును అసలు వడ్డీలతో సహా ఆరునెలల లోపలే తీరుస్తానని మాట యిచ్చింది నిజం. మాట యివ్వడమే కాదు– ఆ మేరకు 'నామనోరాజీనా వ్రాయించి యిచ్చిన బాండు' అని ఆ ఊళ్లో ప్రాథమిక పాఠశాల పంతులుగారి చుట్టూ పదిసార్లు ప్రదక్షిణ చేసి బాండు రాయించింది నిజం.

ఆ బాండులో ఎడమ చేతి బొటనవేలికి అంత బండి కందెన రుద్దుకొని వేలిముద్ర వేసింది నిజం. ఆ సమయంలో ఆ దారిన పోతున్న చెంగారెడ్డిని చంద్రయ్యను బ్రతిమ లాడి సాక్షి సంతకాలు వేయించింది నిజం. ఆ రోజు నుండి ఆ అప్పును తీర్చి 'ఋణ విముక్తుడు' కావాలని కలలు కనింది నిజం!

అయితే యిచ్చిన మాట ప్రకారం ఆరు నెళ్లలు కాదు– ఆరారు పన్నెండు నెలలైనా అప్పు తీర్చలేకపోయింది కూడా నిజం!

మాకడు కులం తక్కువవాడే కావచ్చు. కానీ గుణంలో మాత్రం కాదు. కాలం కలిసి రానపుడు ఎంత గుణవంతుడైతే మాత్రం ఏం చేస్తాడు? ఎంత బలవంతుడైతే మాత్రం ఏం చేస్తాడు? అందుకే మాకడి మాట మాటగానే మిగిలిపోయింది.

మాకడు మాధవ నాయుడి ఎదుట పడలేదు. అలాగని తప్పించుకుని తిరగలేదు. మాట విలువ తెలిసినవాడికే ఆ బాధ అర్థ మవుతుంది.

మాకడు మధనపడి పోతున్నాడు.

నెమలి కంట్లో నీళ్లుగార్తే వేటగాడికి ముద్దా?–

మాధవ నాయుడు కారాలు మిరాలు నూరుతున్నాడు. నూరడా మరి? ఆరారు పన్నెండు నెలలు దాటినా 'అడిగిన తక్షణం చెల్లించి ఈ బాండులో చెల్లు వ్రాయించి నా బాండు నేను వాపసు తీసుకోగలవాడను' అన్న పెద్ద మనిషి నిలదీసి అడిగినా బెల్లం కొట్టిన రాయిలా ఉలక్కుండా పలక్కుండా వుంటే?–

నాయుడికి బదులు చెప్పలేకపోతున్నాడని నడిమధ్య ఎవరైనా తలదూర్చి! 'ఏ ఏరామాకా? నువ్వు చెప్పిందేమి? చేసిందేవిరా? అంటే–

"ఏవి జెయ్యమంటారు మీరే సెప్పండి సావి! అప్పుజేసి పప్పన్నం తినాలని మునాస పడ్డినా? కట్నాలు కాని కలిచ్చి ఎదిగిన బిడ్డెను ఎవుడి సేతిలో అయినా పెట్టాలనుకుంటినా? లేదు వగా వ్రటా కావి మా యింట్లో దానికి పైన్నుండి కింది దాకా దిగేయాలనుకున్నానా? వుండే

కొండ్ర రొండెకరాల్ను నమ్ముకుంటి. నమ్మినావనబోస్తే పుచ్చి బుర్రలాయెనే?... ఇంక నన్నేంజెయ్‌మంటారు మీరే సెప్పండి."

ఆశించింది సమాధానం. ఎదురయింది ప్రశ్న. తలదూర్చిన పెద్దమనిషి అటు యిటు కూడా చెప్పలేకుండా తనకలాడిపోతాడు. తనకలాడ కేం చేస్తాడు? పల్లెటూళ్లో పాలన్నం తినే పెద్దమనిషి కదా అతడు. అదే నల్లకోటు తొడుక్కునే నగరవాసి అయితే తమాషాగా జుట్లు పట్టిస్తాడు. అప్పు ఇచ్చినవాడు వెళ్లితే- 'ముక్కుపిండి వసూలు చేద్దాంలే. రాతకోత లేకుంటే గదా బాధ!' అంటూ భుజాలెగరేస్తాడు. అదే బాకీ తీర్చవలసిన వాడు వెళ్లితే 'అరెరెరె! ఈ దేశాన్ని తాకట్టు పెడితే కూడా చేసిన అప్పు తీరదే? నువ్వొక్కడు తీర్చకపోతే కొంపలు మునిగి పోవులే!' అంటూ ముక్కులెగరేస్తాడు.

మాకడు పాపం అమాయకుడు!

ఈ దేశం ఎందుకు అప్పు చేసిందో? ఎవరి దగ్గర అప్పు చేసిందో? అసలు అప్పు ఎందుకు చేయవలసి వచ్చిందో? చేసిన అప్పు ఎంతయితే ఆ అప్పు దేశాన్నే తాకట్టు పెట్టినా తీరదో? తీర్చలేని సామర్థ్యం లేనపుడు అప్పు ఎందుకు చేయాలో? పోనీ తెచ్చిన అప్పు ఏం చేశారో?. ఈ వివరాలతో వాడికి అవసరం లేదు. అసలు ఆలోచించలేదు కూడా! వాడు ఆలోచించేది తాను నమ్ముకొన్న రెండెకరాల భూమిని గురించి. తన్ను నమ్ముకొన్న పెండ్లాం పిల్లల్ని గురించి, ఆ తర్వాత తాను తీర్చవలసిన బాకీని గురించి!

ప్రస్తుత పరిస్థితుల్లో తీర్చవలసిన బాకీని గురించి ఎంత ఆలోచించినా వాడు చేయగలిగింది ఏమీ లేదని వాడికీ తెలుసు. వాడికి అప్పు యిచ్చిన నాయుడికీ తెలుసు. ఇక పెండ్లాం పిల్లలు. వాళ్లదేముంది? ఉంటే అంత తింటారు, లేకుంటే కాళ్లెత్తి కడుపులో పెట్టుకొని ఏ మూలనో ముడుక్కొంటారు. మిగిలింది రెండెకరాల నేల! అదే యిన్ని తిప్పలకు మూలం!

పుడమితల్లిని నమ్ముకొని చెడినవాళ్లు లేదంటారు కానీ వాడు చెడిపోయింది అక్కడే! తనకంటూ ఒకరుంటే తల దగ్గర కూర్చొని ఏడుస్తారన్నట్టుగా తనకంటూ అంత కయ్యాకాలవ ఉంటే తన రెక్కల కష్టం తనకే దక్కుతుందని మాకడు కలలు కన్నాడు. ఏండ్ల తరబడిగా కూడబెట్టిన కూలి డబ్బుల్ని మండలాఫీసు మొనగాళ్లకు తినబెట్టాడు. ఆ రెండెకరాల నేల తనది అనిపించుకున్నాడు. అదేదో పాత సామెతలాగా ఓలిసులువని గుడ్డిదాన్ని పెండ్లాడినట్లయింది. మిట్టా గట్టా చదునుచేసి ఆ భూమిని సాగుయోగ్యంగా చేయడానికి వాడు పడిన పాట్లు? చెమటతో కలిపి పెండ్లాం ముక్కుల్లో చెవుల్లో వున్న నగానట్ర ధారపోస్తే కానీ ఆ నేలమీద నాగలి తిరగలేదే?

రెండు బక్కెద్దుల్ని కొన్న అప్పు అదనంగా మిగిలింది!

గాటికి గొడ్డు దొంతికి కడవే వచ్చిన వేళా విశేషం. రెక్కాడితే డొక్కాడిన కొంపలో రెక్కలు ముక్కలు చేసుకొన్నా పూట గడవడం దుర్లభమైపోతూంది. గత రెండేండ్లుగా వాడు తన రెండెకరాల భూమిని గురించి ఆలోచించడమే మానుకున్నాడు. మానుకొనక ఏం చేస్తాడు? చిటుక్కుమని చినుకు నేల రాలకపోతే? బావి వసతి లేదు. కేవలం వర్షాధారంతో పండితే పండాలి. లేకపోతే ఎండాలి. ఎండి బీటలు వారిన నేలను కన్నీళ్లతో తడిపినా కడుపులు పూడతాయా? అందుకే మాకడు తన పారా పలుగు మూలబెట్టి పరాయి పారా పలుగు చేతికందుకొన్నాడు. చన్నీళ్లకు వేన్నీళ్లుగా వాడి పెండ్లాం నుంగి ఈ యింట ఆ యింట పాచిపనులు చేస్తూంటే మూడు పూటల కొక పూటగా కాలం గడిచిపోతూ వుండేది. ఇప్పుడామె పాలిటికి బక్కెద్దులు! కొంప ముందర కట్టు గూటానపడ్డి. అవి 'అంబా!' అని అరుస్తూంటే వాటికంత మేపు తేవడానికే ఆమె పని సరిపోతూ వుంది.

కాలం గడుస్తూ వుంది. గడుస్తున్న కాలం అలానే గడిస్తే? గడవదే? అదే చిత్రం. ఏదో చేస్తుంది. ఆశావాది మనిషి. ఆశలు పెంచుకొంటాడు. ఏదేదో చేయాలనుకొంటాడు. చేస్తాడు. చేసే దొకటి, జరిగేది మరొకటి!

చేతులు నెత్తిమీదికొస్తాయి

ఆ చేతుల్ని దింపడానికి ఈ దేశంలో చేతులు లేవు!

అదే మాకడి గతి కూడా!!

ఆ ఏడాది అదునుకు ముందుగానే పదును చినుకులు పలపల నేల రాలాయి. మాకడి గుండెల్లో ఆశలు మొలకెత్తాయి. ఆ వారం పది రోజుల్లోనే మూడు నాలుగు పదున్లు వాన పడేసరికి మాకడి ఆశలు చిగురించాయి. అయినా ఏం చేస్తాడు? మూలపడేసిన పార పలుగూ కాడిక్రరు వుండనే వున్నాయి. బక్కెద్దు జతకు ఎద్దు? ఏదో తిరుగులేని రోగం వచ్చి తనకు దానికి ఋణం తీరిపోయి అప్పుడే ఆరు నెలలు కావస్తూందే! అందుకే మాకడు మాధవ నాయుడి దగ్గరికి పరుగెత్తాడు. కాళ్లావేళ్లా పడి బతిమలాడాడు. అప్పు చేశాడు.

మాకడి చేతిలో డబ్బులు, అప్పుచేసిన డబ్బులు. పేరాశలై ముందుకు పరుగెత్తిస్తు న్నాయి. మాకడు నడుస్తున్నాడు. ధీమాగా నడుస్తున్నాడు. నేరుశెనగ పంట, తొంబై రోజులు

## "సోలార్"

"అదేమిటి మీ ఇంట్లో వారంతా ప్రకృతి వైద్యం చేయించుకుంటున్నారు. పచ్చి కూరగాయలు నానపెట్టిన బియ్యం తింటు న్నారు!"అని అడిగాడు యింటికొచ్చిన చుట్టం!
"అబ్బే అదేం లేదు! మా ఇంట్లో సోలార్ స్టౌవ్ వాడుతాం ఈ రోజు వర్షం కురిసిందిగా అందుకే" అని అంటూ చుట్టం పళ్ళెంలో కూడా వడ్డించింది కాంతం!!

"క్రోక్విల్" —ఖమ్మం



"పరుజూచున్ వరుజూచునొంప నలరింపన్..." చిత్రం : మారేమండ శ్రీనివాసరావు

కళ్లు మూసుకొంటే చేతికొచ్చే పంట. మంచి ధర కూడా పలుకుతూ వుంది. రెండెకరాల్లో ఎంత కవాకష్టంగా పండినా ముప్ఫై బస్తాలు. లేదు యిరవై బస్తాలు పండినా చాలు. ఈ అప్పు ఒక లెక్కలోకి రాదు.

ఈ ఆలోచనలతోనే మాకడు యిల్లు చేరాడు.

"ఈ వానలు ఎప్పుడొస్తాయో ఎప్పుడు పోతాయో వాటికే తెల్దు. ఈ గుడ్డ తడవని సినుకుల్ని నమ్ముకోని గుట్టుగా బతికే కాపురాల్నెత్తి ఈదిలో ఏసుకుంటే ఎట్నే...? అప్పుంటే మాట్లా? పిల్లలు పెట్టానే వుంటేంది గదే?"

మాకడి పెండ్లాం మంగ గొణిగింది.

మాకడు నిప్పుమీద ఉప్పుకల్లులా యిక్కడెగిరి అక్కడ పడ్డాడు. అక్కడ నిలబడి మంగమీద విరుచుకపడ్డాడు.

"ఎత్తకుంటానే మొత్తుకోళ్లన్నెట్టు ఏం కూసినావే పిరిబేసి మొకవా? ఇప్పుడు తట్లో తాంబూలం బెట్టి ఎవుడే నిన్ను సలహా అడిగింది? అసలు ఆడదాని బుద్దే అలుసు బుద్ది. నోటికొచ్చినట్టు వాగేది తప్పితే నోకం తెలిసి ఏడిస్తే కదా? అయినా మన పార. మన పలుగు. మన మడక. మన కాడి. మన బావి. మన ఎద్దులు. మన కష్టం మనది. ఈ పదునుకే దుక్కిదున్ని యిత్తనం యేసేస్తే యింకేం వుండాదే? మూడంటే మూడు నెలలు. తిరిగి మూసేకుందికి వచ్చేయవా?"

మాకడు మంగను వొప్పించడానికి ప్రయత్నించాడు.

"తల్సుకుంటే తాళేది లేదు. ఒకరు సెప్తే యినిపించుకుండేది లేదు. నీ తలపాడు నువ్వు పడ్తానంటే పడు."

అయిష్టంగానే మంగ తన యిష్టాన్ని తెలిపింది.

మాకడు పరుగు పరుగున పలమనేరు సంతకు వెళ్లాడు. పలమనేరు సంత అంటే ఎద్దుల పరష. పరషంతా తిరిగి ఎద్దు జతకు ఎద్దును కొన్నాడు. పారా పలుగు కాడీ క్రరు సిద్ధం చేసుకొన్నాడు. రెండెకరాల చేనిలో మడక కట్టాడు. రెండేండ్లుగా బీడుపడి వున్న నేల. ఎటు చూసినా కసువు కంపా రాళ్లా రప్పలే! ఒకవైపు నుండి మాకడు మడక దున్నుతూంటే మరొకవైపు నుండి మంగ పిల్లలూ రాయిరప్పా కసువు కంపా ఏరి కుప్ప పోశారు. రాళ్లను గనిమలమీద వరసగా పేర్చారు. కసువు కంపను మంటబెట్టి కాల్చారు. బూడిద దున్నిన దుక్కితో కలిసి పోయింది. అది నేలకు మంచి సత్తువ.

విత్తనానికి అనువుగా దుక్కి సిద్ధమయింది.

ఇక కావలసింది విత్తనాల గింజలు, మేలురకం విత్తనాల్ని గురించి ప్రభుత్వం రేడియోలో చెప్తుంది. టీవీలో చూపిస్తుంది. మంచి రకం విత్తనాలతో మంచి పంట పండించమని హితవు చెప్తుంది. అటువంటి విత్తనాలను సరసమైన ధరలకు ప్రభుత్వమే సరఫరా చేస్తుందని కూడా చెప్తుంది.

చెప్పేదంతా జరిగేటట్టుగా వుంటే ఈ దేశంలో రైతు ఈ స్థితిలో వుండేవాడు కాదు.

ఏది తెలిసినా మరేది తెలియకపోయినా మాకడికి ఈ సంగతి మాత్రం బాగా తెలుసు. అందుకే వాడు విత్తనాల గింజల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగలేడు. మంచి విత్తనాలు పావలా సరసంగా పడమటి ప్రాంతంలో చిన్నగొట్టిగల్లులో దొరుకుతాయని విన్నాడు. అందుకే అక్కడికి ప్రయాణం కట్టాడు.

మాకడి గుడిసెలో టీవీ లేదు. రేడియో లేదు. పోనీ పంచాయతీవాళ్లు పెట్టించిన రేడియో వుందిగదా అంటే? అది సర్పంచ్ గారి యింటికే పరిమితమైపోయింది. ఇక వాడికి రేడియో వినే అవకాశం ఎక్కడుంది? అయినా అనుభవం వాడికి నేర్పింది ఎకరాకు అధమ పక్షం ముప్ఫై శేర్ల సజ్జ విత్తనం కావాలని. ఆ ప్రకారం రెండెకరాలకు ముప్ఫై ముప్ఫై అరవై శేర్లు. శేరు పన్నెండు రూపాయిల వంతున చిన్నగొట్టిగల్లులో కొని తెచ్చాడు. తన మడకతో కూడా మరొక కూలి మడకను కుదుర్చుకున్నాడు. ఆ పదును మీదనే విత్తనం వేశాడు.

అప్పుడు మాకడు ఉత్తరంగా తిరిగి నిలబడు కున్నాడు. రెండు చేతులు జోడించాడు. "సామీ! పంట బాగా పండాలి. మంచి ధర పలకాల. దుడ్లు చేతికి రావాల. ఇల్లు తీర్తం వచ్చి యిద్దో ఈ రొండు పాదుల మిందొచ్చిన దుడ్లు నీ హుండీలో ఏస్తా!!" పెళ్ళాంటు మొక్కుకున్నాడు.

ఆ రెండెకరాల్లో ఏడుకొండల వాడి పేరుమీద వెలిసింది రెండు పాదులు!

ఆ రోజు నుండి ఆశగా ఆకాశం వైపు చూస్తూ కూర్చున్నాడు. చూస్తూ చూస్తూ వుండగానే రెండు వారాలు తిరిగి పోయాయి. ఆ సమయంలో కనీసం గుడ్డ తడిచే చినుకులు పడినా భూమిలో పడిన గింజ మొలకెత్తు తుంది. పడిన కష్టం ఏమవుతుందో? అని మాకడు తల్లడిల్లిపోతూంటే వున్నట్లుండి మబ్బె క్కింది. ఎక్కిన మబ్బు నిలకడగా నిలిచింది. మాకడి మనస్సును అర్థం చేసుకున్నట్లుగా కరిగింది. పదును చినుకులతో పుడమి తల్లి పులకరించింది.

మాకడు ఉత్తరంగా నిలబడి మొదట ఏడు కొండలవాడికి ఆ తర్వాత తలపైకెత్తి ఆకాశ రాజుకు చేతులు జోడించాడు.

మళ్లీ వారం తిరిగేసరికి గింజ మొలకెత్తింది. ఆ మొలక నేలతల్లి గుండెల్ని పెకలించుకొని పైకి వస్తూ వుంది. పగిలిన పుడమితల్లి గుండెలు పైకొస్తున్న మొలకకు గొడుగు పట్టడం చేనంతా గొడుగులు గొడుగులుగా వెన్నెల కుప్పలు పోసినట్లుంది.

విశ్వ కవి మన రాష్ట్రంలోని వేసవి విడిది మదనపల్లెలో విడిది చేసినప్పుడే మన జాతీయ గీతం 'జనగణమన' వ్రాశారట!

★★

మన తొలి తెలుగు వ్యాకరణం రెవరెండ్ విలియం కారే వ్రాసిన "తెలుగు వ్యాకరణం" 1814లో ముద్రింపబడింది.

- అమ్మయుని రాజ్యశ్రీ

## చిలక పలుకులు

హాస్యంలో చిలకమర్తివారికి ఒక ప్రత్యేకత వుంది. ఆయన నాటక సమాజానికి నాటకాలు వ్రాసి ఇస్తుండే వారు. ఒకనాటి సాయంత్రం ముచ్చటలాడు కుంటూ సభ్యులంతా ఉల్లాసంగా వున్న సమయంలో హనుమంతరావు నాయుడుగారు పకోడీలు తెప్పించి అందరికీ పంచి పెట్టారు. అప్పుడక్కడ ప్రకాశం పంతులుగారు కూడా వున్నారు. అవి తింటూ పకోడీల మీద పద్యం చెప్పండి పద్యానికి ఒక పకోడీ చొప్పున బహుమతి ఇస్తామని చుట్టూ వున్న సభ్యుల్లో ఒకరు అన్నారు. అందుకే చిలకమర్తివారు "కవులకు వెనుక అక్షర లక్షలు ఇచ్చే వారు · ఇప్పుడా రోజులు పోయాయి. చివరకు పద్యానికి ఒక పకోడీ నిచ్చే దుర్దినాలు వచ్చాయి" అని జవాబిచ్చి ఆశువుగా పది పద్యాలు చెప్పేశారు పకోడీల మీద - కనీసం అప్పుడు పద్యానికి పకోడీ దక్కింది చిలకమర్తివారికి. కానీ ఇప్పుడయితే మండిపోతున్న నూనె రేటుకు మొత్తం పద్యాలకి ఎన్ని వచ్చేవో మరి.

— జె. లలితాదేవి

మాకడి మనస్సు ఊహాల పల్లకెక్కింది!

నెల తిరిగేసరికి మొలక చెట్టయింది. చేనుమీద పచ్చని కోడిపిల్లలు వొదిగినట్లుగా నవనవలాడుతున్న వేరుశెనగ పంట కనుల పండువుగా వుంది.

"ఇప్పుడింకొక్క పదును చినుకులు పడ్తే.." అనుకొన్నాడు మాకడు. అనుకొంటే అదేమైనా వాడి చేతిలో పనా? చేతనైన పనా? కాదే? వాడు అనుకొంటూనే వున్నాడు. ఎండ దినదినానికి పెరిగిపోతూనే వుంది. చూస్తూ చూస్తూ వుండగానే తిండీ నీళ్ళు లేక మెడలు వాలేసిన కోడిపిల్లల్లా చెట్టు వాడిపోయింది.

మాకడు ఊహాల పల్లకి నుండి కింద పడి లబోదిబోమని మొత్తుకొన్నాడు.

రెండు పాదుల మామూల్ని లంచంగా స్వీకరించిన ఏడుకొండలవాడు కూడా ఏమీ చేయలేక చూస్తూ ఊరకున్నాడు. ఊరూనాడు మాత్రం ఆత్రగాడికి బుద్ధిమట్టని ఆడి పోసింది. మాధవ నాయుడు దగ్గర అప్పు అసలు వడ్డీతో కలిసింది. ఆ మొత్తం కొత్త అసలయింది. ఆ అసలుకు అసలుసిసలైన ప్రో.నోటు రాయడానికి మాకడు ప్రాథమిక పాఠశాల అధ్యాపకుని చుట్టూ మళ్లీ ఆరుసార్లు ప్రదక్షిణ చేయవలసి వచ్చింది. కొత్త ప్రో నోటు పుట్టింది. నాయుడిగారి పెట్టెలో వొదిగింది. పిల్లలు పెడుతూ కూర్చుంది.

మాకడి చేతికి మళ్లీ పరాయి పారాపలుగు తప్పలేదు. వాడి చేతికి పరాయి పారా పలుగు రాకపోవడం వింత కానీ రావడంలో వింతలేదు. అందుకే వాడు వాడిలాంటి మనుష్యులు వున్నవాడికి ఒక్క యిల్లయితే అడక్కతినే వాడికి అరవై యిండ్లని తృప్తిపడ్తున్నారు. నిజమే గదా? ఆ అరవై యిండ్లల్లో రెక్కలున్నవాడికి ఎక్కడో ఒకచోట పని దొరక్కుండా పోదు. అరాకొరగా అయినా పొట్ట పూడకపోదు. కానీ కాలం వాడిని అక్కడికీ విడిచిపెట్టలేదే?

సరైన అదనులో మళ్లీ రెండు పదునులు చినుకులు పడ్డాయి. అదనుకు తగిన పంట పెట్టాలని ఊరు ఊపు అందుకొనింది. కాడి కర్రు సరిచేయించుకొనేవాళ్లు... కొత్త మడకలు చెక్కించుకొనేవాళ్లు.. ఊరి ముందర కొలిమిలో పారా పలుగు సరిచేయించుకొనే వాళ్లు- ఊళ్లో ఒక తిరునాళ్లే జరిగినట్లుంది.

మా కడు చూస్తూ ఊరుకోలేక పోయాడు.

ఈసారైనా దేవుడు కరుణించకపోతాడా? అని వాడి నమ్మకం. ఆ నమ్మకంతోనే నాయుడు దగ్గర మళ్లీ అప్పు చేశాడు. చేను దున్నాడు. విత్తనాల గింజలు కొని తెచ్చాడు. మంచి లగ్నం చూశాడు. ఆ లగ్నం మేరకే విత్తనం వేశాడు. వేస్తే ఏమయింది? ఆ మరునాటి నుండి వాన వదలలేదు. భూమిలో వేసిన విత్తనం గింజ కుళ్లిపోతే కానీ వాన వదలలేదు.

ఒకసారి అనావృష్టి. మరొకసారి అతివృష్టి. దెబ్బ మీద దెబ్బ. అప్పు తడిసి మోపెడయింది. ఆ అప్పు తీర్చాలి. తీర్చాలంటే ఏం చేయాలి? ఏం చేయాలని నెత్తిన చేతులు పెట్టుకుని ఆలోచించాడు. వాడికి కనిపించింది ఒకటే మార్గం. ఎద్దుగొడ్లను అమ్మేయడం. అమ్మితే వచ్చే దుడ్లు అసలుకు సరిపోవచ్చు. ఇక వడ్డీ. వడ్డీ కట్టలేనంటే మాధవ నాయుడు వదిలి పెట్టాడా? అది కాని పని. అయితే ఏం చేయాలి? వడ్డీ మాపు చేయించుకోవడం ఎలా? ఈ ఆలోచన మనస్సులో పడేసరికి వాడి కన్నుల్లో మెదిలింది జయరామయ్య.

జయరామయ్యను గురించి ఎంతయినా చెప్పవచ్చు. అయినా ఎంత చెప్పినా కొంతే అనిపిస్తుంది.

జయరామయ్య పెద్దపెద్ద ఆఫీసర్లకు ఆప్తుడు. నిరుద్యోగులకు కల్పతరువు. పేదసాదలకు పెన్నిధి. అవసరాలకు అరచేతిలో వెన్న - ఇలా చెపుబెట్టి చెప్పుకపోవచ్చు. జయరామయ్య ఒక మారుమూల పల్లెలో పుట్టి పెరిగిన మనిషి. పెద్దగా చదువు సంధ్యలు లేని సాదాసీదా మనిషి. అతడు సాధించిన పేరు సంపాదించిన ఆస్తిపాస్తులు అంతా ఇంతా కాదు. ముగ్గురు కూతుర్లకు వైభవోపేతంగా పెండ్లిండ్లు చేయించాడు. ఇద్దరు కొడుకులను ఆఫీసర్లు చేశాడు. ఇంత చేసినా చేతికి మట్టి కాలేదు. అదెలా సాధ్యమయిందంటే? అదే జయరామయ్య ప్రత్యేకత.

ఆడపిల్లలున్న ఆఫీసర్ల ఆరా తీస్తాడు. ఆఫీసులో కలుసుకుంటాడు. ఆరాలతో మొదలుపెట్టి హైదరాబాద్ వరకు అద్భుతమైన అరవై సంబంధాల వివరాలు వినిపిస్తాడు. వ్యక్తిగత విషయాల చర్చ ఆఫీసు నుండి ఇంటికి మారుతుంది. ఇంటిలో రోజులు గడవక ముందే అమ్మగారికి ఆప్తుడైపోతాడు. నూరు అపద్ధాలు అలవోకగా చెబుతాడు. 'అయ్యో పాపం' అపద్ధం అంటే జయరామయ్యకు అర్థం తెలియదే?' అనిపించుకుంటాడు. పీటలమీది పెండ్లికి తానే కర్త అయి కూర్చుంటాడు. ఆడ కూతురు బరువు దింపుకున్న ఆఫీసర్ ఆ పీదట కూర్చోమంటే కూర్చుంటాడు. లే అంటే లేస్తాడు.

అక్కడికి ఆగిపోడే మనిషి. ఆగిపోతే ఆయన జయరామయ్య ఎలా అవుతాడు. ఆ పరిచయానికి పాదులు కడతాడు, నారు పోసి నీరు పెడతాడు. ఆ పంట పండేసరికి నలుగురు నిరుద్యోగుల పంట పండిపోతుంది. తన పంటా పండిపోతుంది.

మనిషి అవసరాన్ని పసికట్టడానికి నేర్పు అవసరం. ఆ అవసరాన్ని తీర్చడానికి ఓర్పు అవసరం. ఈ రెండూ పుట్టింది జయరామయ్య నట్టింట. పెరుగుతున్నది ఆయన వొంట! అటువంటి ఘటనా ఘటన సమర్థుడు తలుచుకోవాలే కానీ మాకడి వడ్డీ మాఫీ చేయించడం ఎంతసేపు?

ఈ ఆలోచన మనసులో పడడమే తరువాయి. మాకడు నిలిచిన చోట నిలబడలేక

**అబ్బాయికి అమ్మాయి; అమ్మాయికి అబ్బాయి నచ్చారు. అంతకు మించి అబ్బాయి తండ్రి అడిగిన కట్నకానుకలు ఇవ్వడానికి అమ్మాయి తండ్రి అంగీకరించాడు. అయితే ఆ పెళ్ళికి పిల్ల తల్లి ఒకే ఒక షరతు విధించింది. "కట్న కానుకలతో పాటు గ్యాస్ స్టవ్, సిలిండరు కూడా మేమే ఇస్తాం. మీ ఇంట్లో కిరోసిన్ స్టవ్ గాని, దీపం గాని కనిపించడానికి వీల్లేదు"**

**"సకాలంలో గ్యాస్ బండ రాలేదనుకోండి, అప్పుడు-", అబ్బాయి తల్లి తన సందేహాన్ని వ్యక్తం చేసింది.**

**"మీకా ఇబ్బంది వస్తే భోజనం క్యారియర్ పంపిస్తాం. మీ ఇంట్లో మాత్రం కిరోసిన్ వాసన రావడానికి వీల్లేదు" కరాకండిగా చెప్పింది.**

**— బాకోట్**



పోయాడు. ఎప్పుడెప్పుడు జయరామయ్యను కలుసుకోపోతామా? అన్న తపన ముందుకు లాగుతూంటే మాకడు నడుస్తున్నాడు. నడక పరుగయింది. పరుగుల మీద ఊరు చేరుకున్నాడు. ఊళ్లో జయరామయ్య ఇంట్లో అడుగుపెట్టాడు. అదృష్టం బాగుంది. ఏడూళ్ల మణేగాడు జయరామయ్య ఆ పూట ఇంట్లోనే వున్నాడు. జయరామయ్య ఎదుట పడడమే తరువాయి. మాకడు ఆయన కాళ్ల మీద పడ్డాడు.

''ఒరే ఒరే! యిది మాధవ నాయుడి ఇల్లు కాదు. నువ్వు పట్టింది ఆయన కాళ్లు కాదు గదరా...? అయినా కాళ్లు పట్టుకుంటే పనులవతాయని ఎప్పుడు నేర్చుకున్నావ్! ఎక్కడ నేర్చుకున్నావురా? లెయ్‌రా లెయ్!''

మాకడు లేవలేదు.

''వచ్చిన పని చెప్పకుండా కాళ్లమీద పడినా కండ్లనీళ్లు పెట్టుకున్నా ఏం ప్రయోజనం? లెయ్‌రా లెయ్''

మాకడు లేచి నిలబడ్డాడు.

''చెప్పరా చెప్పు. దారి తప్పిన కారణం చెప్పు. కాళ్లమీద పడాల్సిన అవసరం చెప్పు''

''అయ్యా! పెద్ద పెద్దోళ్లయితే సేతులు పట్టుక్కోని ఇవ్వి సేతులు గాదంటే సెల్లిపోతుంది. తక్కువ జాతి యదవలం. కాళ్లకాడి కొస్తే కనికరిస్తారని...'' మాకడు చేతులు నలుపుకుంటూ నంగి నంగిలా అన్నాడు.

''ఆహా! మాట సుద్దీసూక్ష్మం గూడ తెలుసుకున్నావే? ఇంక నేనెందుకురా?''

''సాపీ సాపీ! అంత మాటనబాకండి. మీ కడపన బుట్టి రుణం తీర్చుకుంటా. తూచెహ! నేనూ ఒక మణిసినే?... నాదీ ఒక మాటేనా? పోనీ తవరే సెప్పండి. నేనేబోతే మాదవనాయుడు నన్ను నోరన్న తెరవనిస్తాడా?''

''ఇంట్లో చీమ చిటుక్కుమంటే నాయుడికి నువ్వే కావాలి గదా? మరి నిన్ను నోరు తెరవనివ్వకుండా నన్నా తెరవనిస్తాడు?''

''అప్పులో డెంటా సెప్పులో డెంటా పోగూడదంటారు. అయినా నాకు తప్పితిందా?!''

''ఆహా అయితే అప్పు ఎందుకు చేశావ్?''

''బతకడా వనుకుంటి...''

''బతకతానంటే వద్దనింది ఎవ్వరా''

''నా తల్రాత!''

''నేనేం బ్రహ్మదేవుడినా తలరాతలు మార్చే దానికి?''

''బెమ్మ దేవుడుండాడో లేడో మాకు తెల్దు. అయితే ఈ ఊళ్లో వాళ్లందరికీ దేవుడి మాదిర్తో జయరామయ్య గోరుండారని మాత్రం అందురికీ తెల్సు. తవరికి తెలియన్దే వుండాదయ్యా? వాగిటికి రొండుసార్లు. నేల తల్లిని నమ్ముకుంటి. రెక్కలు ముక్కల్జేసుకుంటి. నోట్లో ఏలు పెట్టుకుంటి. నాయుడయ్య దగ్గిర్జేసినప్పు అంతకంతయింది. నేను పుట్టింది మాయబ్బకు మాయమ్మకే - ఒకరికి పుట్టి ఇంకొకరి రుణాన పొయ్యే దెందుకు? ఉండే రొండు ఎద్దుగొడ్లను అమ్మి పారేస్తే వొచ్చేదుడ్లు అసలుకు సరిపోతాయి. మీరు కలగజేసుకుంటే నాయుడు కాదనలేదు. ఆ వడ్డీ దుడ్లట్లా తొయ్ పించెయ్యండి. బాకీ కట్టేసి బయట పడ్తా. సచ్చి మీ కడపన పుడ్తా''

''సరే మాస్తా పోరా!'' అన్నాడు జయరామయ్య తలపంకిస్తూ.

జయరామయ్య చూస్తానంటే సూర్యచంద్రులు అడ్డుపడినాయిక ఆ పని ఆగదు.

మాకడు మళ్లీ ఒకసారి జయరామయ్య కాళ్ల మీద పడ్డాడు!...

* * *

''ఈ పల్లెకొంపల్లో మొకం సాటు జేసుకోని తిరిగేదాని కవుతుందా? తిరిగినా ఎంత కాలమని తిరగ్గలగతాం? ఎక్కడ నాయుడెదురు పడ్డాడో? ఎన్నెన్ని మాటలు పడాల్నో? బొదుల్జెప్పలేకుండా సెప్పకుండా వుండలేకుండా ఎందుకులే ఆ తనకలాట? పగోడి గ్గూడా వద్దు సావీ వద్దు. సీసీ! గుండెకాయిలు అర్సెతల్లో పెట్టుకుని బతికేబతుకు అదీ వొకబతుకేనా? ఉంటే తినచ్చు. లేకుంటే పస్తులు పడి సావచ్చు. జయరామయ్య పున్నెం గట్టుక్కోని నాయుడు అసలు దుడ్లుసాలంటే అదే పదేలు. ఈ బాకీ తంట తీరిపోతే మంచినీళ్లు తాగి మానికింద బతకచ్చు. ఇంక ఎద్దుగొడ్లనుబేరానికి పెట్టాల్సిందే?'' మాకడి ఆలోచన.

''ఏం మొగోడమ్మా ఈ మొగోడు? అప్పు లేకుండా ఎవుడికైనా ఆస్తి ఏర్పడితిందా? 'అప్పు అప్పు' అంటా అల్లాడి పొల్లాడి పోతా వుండాడు. మాట మాటకు ఎద్దుగొడ్లను 'అమ్మేస్తా! అమ్మేస్తా!' అంటా ఎగిరెగిరి పడ్తా వుండాడు. వద్దని మొత్తుకుంటే యినకుండ అప్పుజేసికొని. అప్పుతీర్చే దానికమ్మె. ఈ రాయబాడానికి కయ్యాగాల నెందుకు? దాన్ని గూడా మూడుం ముక్కలు దుడ్లకు తొల్చేస్తే ఆడికి నిమ్మతిగా వుంటేంది. ఔరా! మొగోడా! ఎద్దుగొడ్ల నమ్మేస్తానని ఎంత లేసుగా అంటివి. నోర్లేని గొడ్లు. అమ్మతానంటే అవ్వి కొట్టబోతాయా? కొరకబోతాయా? ఆ గొడ్లు ఎవుడి గట్లోనో వుంటే నన్నెట్లా సూడమంటావ్? కడుపులో పుట్టిన బిడ్డకైనా వొక పూట బెట్టే ఇంకొక పూట లేదనుంటానే కానీ నోర్లేని గొడ్ల నట్టా సూళ్లేదే? నా బాధ నీకెట్టా అర్తమవుతుంది?'' మంగ తనలో తను మథన పడుతూ ఉంది.

''పట్నే ముసురు వదలకుండా పాయ. వెలి సైరంటే ఎట్లోయేసి నోరు కొట్టుకున్నెట్టాయు.

ఓసారి తంజావూరి రాజా ముందు పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ శంకరాభరణ రాగంలో ''చక్కాగా నీ భజన చేసే వారికి తక్కువ కలదా శ్రీరామా!.దిన దినము'' అని గానం చేస్తుంటే ఒక కుర్ర బుద్ధి సంగీత విద్వాంసుడు (ఆ రోజుల్లో కూడా ఈర్ష్య అసూయాపరులుండే వారు కాబోలు!) ఆయన సంగీతాన్ని విమర్శిస్తూ వెక్కిరిస్తూ రాజా గారి చెవి కొరుకుతున్నాడుట. పాపం పట్నం వారు చాలా హొమ్ముకుని బుద్ధి చెప్పాలని, 'చక్క వినయము చేసే వారికి ఎక్కువ మరియాద ఈ దరకున' అని తన కీర్తనలో చొప్పించి పాడేటప్పటికి, అందులోని శ్లేష అర్థమై ఆ కుర్ర గుమ్మడి కాయ ముచిషి మొహం మాడిపోవ మిగతా వారు ముసి ముసిగా నవ్వుతూ పట్నాన్ని శభాష్ అన్నారుట.

\- అచ్యుతుని రాజ్యశ్రీ



బావుల్లో నీళ్లేవో పొదుగు మింద ఆవులు సేపిడ్చినట్టు ఉపకతా వుండాయి. బావుల కిందన్నా ఒక అయిదారు గుంటలు మడి దున్నుకుంటే ఈ ఫలితానికి తిండిగింజలైనా వస్తాయి.''

బావి నీటి వసతి ఉన్నవాళ్ల అడుసుదున్న డానికి ఆయత్తమవుతున్నారు.

''మాధవనాయుడు చెప్పింది మంచి మాటే గదా? వడ్డీ వ్యాపారం చేసేవాళ్ల ఆలోచనలన్నీ ఇలానే అద్భుతంగా వుంటాయి. ఇద్దరి సమస్యలు తీరడం. మన పరపతి పెరగడం. అంత వరకు చాలు''

''సవాలచ్చ సందేహాలు పెట్టుకుంటే వడ్డీ యాపారం సేసే దాని కవుతిందా? తెచ్చినట్టే వుండాల. ఇచ్చినట్టే వుండాల. లేదంటానే వుండాల. ఇస్తానే వుండాల. మాకణ్ణే యిరికించి కుణ్ణెట్టు యిరికించుకుంటే వాడు పెరుక్కో లేకుండా గిలగిల్లాడ్తా వుంటే నడి దగ్గర గుంజాకుణ్ణె కాడికి గుంజాకోవాలి''

వడ్డీ వ్యాపారంలో ఆరితేరిన మాధవ నాయుడు మీసం మెలి వేస్తున్నాడు.

ఇది బ్రతుకు బ్రతకడానికి తాపత్రయం. ఆ తాపత్రయానికి అనుగుణంగా ఆలోచనలు కాలం గడుస్తూ వుంది.

వారం రోజుల తర్వాత ఒకానొక రోజు మిట్ట మధ్యాహ్నం కడిగి తోమినట్లున్న ఆకాశంలో సూర్యుడు చండ్ర నిప్పులు చెరుగుతున్నాడు. గొడ్డూ గోదా చెట్ల క్రింద గోములాడుతున్నాయి. ఆ ఎండ ధాటికి తట్టుకోలేక రైతాంగం ఏ చెట్టు నీడనో చేరి సేద తీర్చుకుంటున్నారు. మాధవనాయుడి ఇంట్లో కమ్మని భోజనానంతరం మాధవనాయుడు, జయరామయ్య తాంబూల సేవనలోని సుఖాన్ని అనుభవిస్తున్నారు.

మాకడు కొట్టం చూరు నీడలో నిలబడి వున్నాడు.

''ఒరే మాకా! నీకు తలకాయ ఉందాదా?'' తపక్ తపక్‌మని తాంబూలం నములుతూ నాయుడు అడిగాడు.

మాకడికి సందేహం. తనకు తలకాయ ఉందా? లేదా? అన్న సందేహం. ఉంటే నాయుడు ఎందుకు అడుగుతాడు? పోనీ! 'లేదు' అంటే మెడకాయ మీద తలకాయ ఉంది గదా! ఈ సందిగ్ధంలో పడి మాకడు సమాధానం చెప్పలేక తలవంచుకున్నాడు.

''అది గాదురా! నువ్వు చేసే పని నువ్వు చెయ్యాల. నేను సేసే పని నేన్జేయ్యాల. ఎవుర్జేసే పని వాళ్లు జేస్తే అది అందగిస్తుంది'' నాయుడు ఉపోద్ఘాతాన్ని అందుకున్నాడు. జయరామయ్య ముసిముసిగా నవ్వుతున్నాడు! ఏవి సెయ్యరాని పని ఎవుర్దగ్గిర సెయ్యించావబ్బా?' అంటూ మాకడు మల్లగుల్లాలు పడుతున్నాడు.

''అయ్యా మీ దగ్గిర అప్పు జేసి. ఒకటికి రెండుసార్లు పంట బెట్టే ఫలం దక్కకుండా పొయ. అసలు కట్టేస్తా. వడ్డీతో సేయండని ఎదటబడి ఎప్పుడైనా అడిగినావా?''

''లేదయ్యా!''

''మరింత సిన్న పనికి ఇంత పెద్ద మణిసిని అడ్డ పెట్టుకుండేదే నేన్నా బాగుండాదా? జయరామయ్య సాయంగా రావడం. వడ్డీ మాపు జెయ్యమని అడగడం. కాదనే గుండె కాయలు నాకే కాదు ఈ ఊళ్లో ఎవురి కుండాయిరా పిచ్చోడా! పోరా పో! నువ్వు వడ్డీ కట్టాల్సిన సల్లేదు గానీ నెల దినాల్లో పల్నే అసలు కట్టేసి నీ బాండు నువ్వు వాపస్ తీసుకో.

మాకడు రెండు చేతులెత్తి నాయుడికి నమస్కరించాడు.

''ఒరే మాకా! ఈ అప్పు ఎందుకు చేశావురా?'' అంతవరకు తన్మయత్వంలో తమలం సేవిస్తున్న జయరామయ్య రంగంలోకి దిగాడు.

''బావిని నమ్ముకోన్జేస్తినయ్యా!''

''నమ్ముకుంటే ఏమయిందరా?''

''ఇద్దో ఈ గెతి పట్టింది సామీ!''

''అందుకేరా మనిషి అన్నవాడు ఏ పని చేయాలన్నా ముందు ఆలోచించాలి. ఆలోచన లేకుండా చేస్తే అవస్థలు తప్పవు. నీ సంగతే తీసుకో. కాడెద్దులు... నువ్వూ... నీ పెండ్లాం... నీ బిడ్డలు ఇంతమంది ఆకయ్యమీద పడి కష్టపడ్డారు కదా? కడకేం మిగిలింది?''

''నా తాడు మిగిలింది''

''ఒరె ఒరె! తాడు ఆడదానికి మిగిలిందంటే అంతకన్నా అదృష్టం లేదు. అదే అప్పు తీర్చలేని వాడికి మిగిలితే అభిమానవంతుడని పేరు తెచ్చుకుంటాడు. అది సరేకానీ నీ ఇన్ని కష్టాలకు మూలం ఏదంటావు?''

''బాగ బతకదావన్న ఆశ!''

''అక్కడే నువ్వు పొరబాటు పడింది. బాగ బ్రతకాలంటే సవాలక్ష మార్గాలున్నాయి. వాటన్నిటినీ కాదని మట్టిని నమ్ముకున్నావు. బతుకు మట్టిపాలయింది.''

''కరట్టుగా సెప్పినారు సామీ!''

''..........................''


''నీ మేలుగోరి చెప్తున్నా 'నా మాట' వింటావా?''

''ఎప్పుడు ఇన్లేదో సెప్పండి సామీ''

''ఎద్దుగొడ్లంటావా? అది నీ తలపాడు. ఎవుడికైనా అమ్ముకో. ఆ రెండెకరాల నేల

పిఠాపురం మహారాజా తమ పిల్లలకు బెంగాలీ ఉపాధ్యాయుల్ని నియమించి చదువు చెప్పించారుట. ఆయన ఆహ్వానంపైనే రవీంద్రనాథ్ టాగూర్ పిఠాపురం వస్తే, స్టేషను నుంచి తమ రాజ ప్రాసాదం దాకా ఎర్ర తివాచీ పరచి ఆయనకి స్వాగతం ఇవ్వటమే గాక శ్రీ సంగమేశ్వర శాస్త్రి గారి వీణ కచేరిని ఏర్పాటు చేశారు. అది విని విశ్వ కవి ముగ్ధులై శాంతి నికేతన్‌కి ఆహ్వానించటం జరిగింది. మన ఈలపాట రఘురామయ్య గారికి టాగూర్ "నైటింగేల్ ఆఫ్ ఆంధ్ర" అన్న బిరుదిచ్చారు.

- అచ్యుతుని రాజ్యశ్రీ



మాత్రం నాయుడికే అమ్మ. నాయుడికైతే కయ్యిలో కయ్య కలిసి పోతుంది. నీ బాకీ పోను నాలుగు దుడ్లు చేతికొస్తాయి''

''నిజవే సామీ ఆ దుడ్లు ఎన్నాళ్లుంటాయి?''

''అదీ చెప్తున్నా. ఎద్దుగొడ్లను అమ్మిన దుడ్లు నాయుడిచ్చే దుడ్లుచేత పట్టుకో. నడు తిరుపతికి. నీకొక కొత్త రిక్షా కొనిస్తా. మీకైతే సబ్సిడీ కూడా వస్తుంది. ఇక్కడ పడ్తున్న కష్టం అక్కడ పడ్తే దినానికి కనీసం యాభై రూపాయిలు ఒక డబ్బసొత్తు గాదు. ఇక నీ పెండ్లాం తట్ట చంకనేసుకుని ఆ నలుగ్గాళ్ల మంటపం దగ్గిర నిలబడ్తే నీలో సగానికి తీసిపోదు. సంపాదించండిరా సంపాదించండి. నాలుగు రూకలు వెనకేసుకొనిరండి.''

ఈ మాటకు కూడా మాకడు రెండు చేతులెత్తి నమస్కరించాడు.

* * *

వారం తిరగకముందే మాకడి రెండెకరాల నేల మాధవనాయుడి పేర రిజిస్టరయింది. మాకడు మహారాజీనా రాయించి ఇచ్చిన ప్రోనోటు చినిగిపోయింది. మాకడి కాడెద్దులు పెద్దిరెడ్డి గాటిలోకసువు తింటున్నాయి. కండ్లు నులుముకుంటూ నాలుగ్గాళ్ల మండపం దగ్గరికి వచ్చిన మంగ రెండు బారల పొద్దెక్కే దాకా నిలబడి నిలబడి ఇక లాభం లేదనుకుని ఇంటి ముఖం పట్టింది. జయరామయ్య రెండవ అల్లుడికి హీరో హోండా కొనడానికి అడ్వాన్సు కడుతున్నాడు. తిరుపతిలో ఒకానొక రోడ్డులో చెట్టుక్రింద సైకిలుషాపు వద్ద నిలబడి ''అయ్యయ్యో కొత్త టూబు కొత్తటైరే! ఎట్టా పంచెరయిందబ్బా?'' అని మాకడు వాపోతుంటే ''వారే పిచ్చోడా టైరు కొత్తది. ట్యూబ్ కొత్తది అని నీకూ నాకు తెల్సు కానీ దిగిన మేకుకేం తెల్సురా?'' అంటూ సైకిల్ షాప్ ప్రసాద్ పకపక నవ్వుతున్నాడు.

నిజమే! మేకుకు కొత్త పాత అన్న విచక్షణ లేదు.

జయరామయ్య లాంటి వ్యక్తులకు పేదసాదలు దయాదాక్షిణ్యాలంటే తెలియవు. హు! రిక్షా ట్యూబ్ పంక్చరయిందని మాకడు తెగబాధపడిపోతున్నాడే కానీ జయరామయ్య వంటి మేకుల మూలాన తనలాంటి ఎన్నో బ్రతుకులు పంక్చరవుతున్న సంగతి గ్రహించాడా?

# మబ్బు తొలగిన వేగుచుక్క

మన తొలి తొలి వలపుల
మల్లెల పరిమళం
మరి మరీ గుర్తుకొస్తున్నది
నేను ప్రేమను ప్రేమించేదాన్ని
ప్రేమించేవాడిని కోరుకునేదాన్ని
కానీ, నీకు జీవితం లెక్కల పేపరు
తీసివేస్తూ కూడుతూ హెచ్చిస్తూ భాగిస్తూ
నీవాడిన నాటకాలు...
చిన్నప్పటి నుండీ
పిల్లి - ఎలుకా, పాము - ముంగిస
దాగుడుమూతలూ
నేను కేవలం నా కోసం
నీ ఆరాటమనుకొన్నాను
కానీ మగవానిగా ''స్నేహితునిగా''
ఎదిగిన నీవు
చెలగాటంలోనూ నేర్పరివే.

నన్నో మైనం ముద్దచేసి
నీ ఇష్టాలకు, అయిష్టాలకు
అనుగుణంగా
వంచి, లాగి, సాగదీసే
ప్రయత్నాలు చేసేదాకా
నన్ను నేను ఎంతగా
నీకప్పగించుకున్నానో...
నీ అభిరుచుల పాత్రలోకి
నా స్వరూపం - స్వభావం
మలచుకోవడం
వలపులోని మలుపు
అనుకున్నానే కాని
క్రమంగా నా ఆత్మను
నగులకొట్టుకుంటున్నాననుకోలేదు
అంతేకాదు
హక్కులు, బాధ్యతల కొల్చేసరికి
నేనెంతగా బానిసత్వాన్ని వరించానో
తెలుసుకుని అప్పుడప్పుడు
కొయ్యబారిపోతాను

నీకు వెలుగు గిట్టేదు
నాకు ఊపిరిచ్చే
కిటికీలు మూసేసుకున్నాను
నీకు సంగీత స్వరాల సుమధుర శబ్దాలు అసహ్యం
నా కిష్టం అయినా మౌనపాశాలతో
నా గొంతు నొక్కేసుకున్నాను
నీకు పూర్తిగా ఏకాంతం కావాలి
— నీ కవసరమైన వాళ్ళ నుండి తప్ప —
మనుషుల కలకలంతో సందడిగా
సజీవంగా ఉండాలని ఉన్నా
ఇంటి తలుపులు మూసేస్తాను.

మా అమ్మ అంటే నీకు బొత్తిగా గిట్టదు
మనసంతా దీపం చేసుకొని
మన ఇంటికి మొదటిసారిగా వచ్చినప్పుడు
మాటల ఈటెలతో, ఈసడింపుల తూటాలతో
ఆమెను ప్రాణమున్న వచ్చి పుండును చేసావు
నా తల నిమిరిన
ఆమె వేళ్ళ చివర్లలో కన్నీళ్ళ నుడిగుండాలు
అవమానాల నిప్పుకణికలు
ఆమెనెలా చిలికాయో... కాల్చాయో...

నన్ను నీ ఇంటిదాన్ని చేసుకోవడానికే
చాలాకాలం సంకోచించావు
అదీ నీ తెలివేనని గర్వించాను
నాకిందికే నీళ్లొచ్చాయి
నా కళ్ళముందే మరో ఆడపువ్వు
నీ కోటు బొత్తానికి వేళ్లాడడానికి
సిద్ధంగా కనిపించింది
జలగకు రక్తం పీల్చడంలాగా
పిల్లికి దొంగబుద్ధిలాగా
నీకూ స్వార్థం సహజలక్షణం
నీ రక్తం స్వార్థపు రంగులోనే ఉన్నా
నిన్ను నిలదీద్దామన్న ఆలోచనే
రాలేదు నాకు
నీవొక తలుపు నిశ్శబ్దంగా మూయగలవు
కనికరం లేకుండా గోతులూ తవ్వగలవు
పాపం! నీది చాలా సున్నితమైన మనసు
నీ భావాల దాకా వస్తే పిచ్చివాడివీ కాగలవు

నన్ను నేను ఎంతగా పోగొట్టుకున్నానంటే
బహుశా నీవు కాళ్ళు రాసుకునే
గోనెపట్టాను కూడా అయిపోతానేమో!
నన్ను నేను ఎంతగా పోగొట్టుకున్నానంటే
బహుశా నీ ఫోటో చుట్టూ
ఖాళీ ఫ్రేమునే అయిపోతానేమో!

నిన్ను వదిలిపోతున్నాను
మగాడివన్న నెపంతో బతకడం కాక
నీవూ మనిషివేనని తెలుసుకుంటావేమోనని!
నాలో పెరిగే నీ అహాన్ని
నాశనం చేసుకున్నందుకూ సంతోషిస్తున్నాను
సమాజాన్ని మార్చే
సజీవ చైతన్యమూర్తులైన
బిడ్డల్ని కనడానికి
నీవూ - నేనూ అనర్హులం
ఎడారుల్లో మహావృక్షాలు పెరగవు
ఇసుకపర్రల్లో మంచినీటి సరస్సులు ఏర్పడవు
మబ్బు పట్టిన తుమ్మపొదల్లో
వెలుగు కిరణం ప్రజ్వరిల్లదు

—శ్రీవత్స

ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో అచ్చయిన సంధ్య షణ్ముగనాథన్ 'లెటర్ ఫ్రమ్ ఎ వైఫ్' కలిగించిన ప్రేరణతో